WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




జులై 11 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 187 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సుద్ అహ్మద్

TUESDAY AUGUST 11 2026 | VOL:18 | ISSUE: 187 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతాం : కేటీఆర్



ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం : అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు

(మిగతా 2వ పేజీలో..)

## జార్ఖండ్ లో విద్యార్థులపై లాఠీచార్జ్..ఖండించిన రాహుల్ గాంధీ



పోటీ పరీక్షల పేపర్ లీక్ లను వ్యతిరేకిస్తూ జార్ఖండ్ లో విద్యార్థులు ఆ రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. విధాన సభవైపు సాగుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ సంఘటనపై తాజాగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. శాంతియుత నిరసన అనేది ఒక హక్కు అని, జార్ఖండ్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడాన్ని రాహుల్ గాంధీ సోమవారం ఖండించారు. "జార్ఖండ్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం తప్పు. విద్యార్థులకు శాంతియుత నిరసన తెలిపే హక్కు ఉంది, చర్చల ద్వారా మాత్రమే పరిష్కారాలు లభిస్తాయి," అని గాంధీ శలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

# వరుణదేవా.. కరుణించవా...

నాగార్జున సాగర్ లో సంపూర్ణమైన వరుణ యాగం.

సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.

విస్తారంగా వర్షాలు కురవాలని దేవీదేవతల ను వేడుకుంటూ పూజలు.





**విజయకెరటం, ప్రతినిధి - నల్గొండ:**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలనీ, కృష్ణాగోదావరి నదులు నిండుగా ప్రవహించాలని.. శ్రీశైలం, నాగార్జునసాగర్ లతో పాటు ప్రాజెక్టులన్నీ నిండుకుండల మారాలని ఆ దేవీదేవతల ను వేడుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి తో కాలిసి ప్రత్యేక పూజలు చేశారు. నాగార్జున సాగర్ లోని విజయవిహార్ గెస్ట్ హౌస్ ఆవరణ లో కృష్ణా నది ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించింది. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ యాగాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు ప్రారంభించారు. వరుణ యాగంలో భాగంగా పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం దంపతులు పాల్గొన్నారు . 108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో వరుణ యాగం నిర్వహించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణయాగం చేపట్టారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని దేవీదేవతలను వేడుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో

(మిగతా 2వ పేజీలో..)

## ఘనంగా లాల్‌దర్వాజా మహంకాళి బోనాలు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

రూ.20 కోట్లతో ఆషాఢ బోనాల నిర్వహణ



బంగారు బోనం సమర్పించిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్ పాతబస్తీలో కన్నులపండువగా సాగింది. లాల్ దర్వాజాలోని ప్రసిద్ధ సింహవాహిని మహంకాళి అమ్మవారికి భక్తులు

(మిగతా 2వ పేజీలో..)

## జార్ఖండ్‌లో ఉద్రిక్తత..విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్



హైదరాబాద్: జార్ఖండ్‌లో నిరసన చేపడుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనాన్‌లు ప్రయోగించారు. జార్ఖండ్‌లో నియామక పరీక్షలలో జరిగిన

(మిగతా 2వ పేజీలో..)

## విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు.. పార్లమెంట్‌లో కేంద్రం హామీ

విద్యార్థులపై పోలీసుల చర్యపై పార్లమెంట్‌లో మాట్లాడనున్న అమిత్ షా

ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చకు సిద్ధమైనట్లు ప్రభుత్వం ప్రకటన

జూన్ 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసన

వారిపై పోలీసుల చర్యలను తీవ్రంగా తప్పుబట్టిన ప్రతిపక్షాలు

పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన వార్తలపై అభ్యంతరం

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సమాధానం ఇవ్వనున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిస్థాయి

(మిగతా 2వ పేజీలో..)



## మావోయిస్టు కంచుకోట కర్రిగుట్టలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన



మావోయిస్టు స్థావరం నుంచి పర్యాటక కేంద్రంగా కర్రిగుట్ట

50 ఏళ్ల తర్వాత శాంతి.. అభివృద్ధికి శ్రీకారం

రహదారి పనులను పరిశీలించిన డీజీపీ

మావోయిస్టుల లొంగుబాటుకు పునరావాస చర్యలు

సీఆర్పీఎఫ్ సేవలను అభినందించిన సీవీ ఆనంద్

**ములుగు, ఆగస్టు 10:**

ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న తెలంగాణ--ఛత్తీస్‌గఢ్--ఒడిశా సరి హద్దులోని

(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడు రాష్ట్ర గీతంపై అసెంబ్లీ తీర్మానం.. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం విజయ్

ప్రభుత్వ కార్యక్రమాల్లో మొదటగా 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడాలని అసెంబ్లీలో తీర్మానం

సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానానికి డీఎంకే, అన్నాడీఎంకే సహా అన్ని పార్టీల మద్దతు

ఇది తమిళ అస్తిత్వానికి దక్కిన చారిత్రక గౌరవమని పేర్కొన్న సీఎం విజయ్

తమిళనాడు శాసనసభ సోమవారం ఒక చారిత్రక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహించే అధికారిక

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

# విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు.. పార్లమెంట్‌లో కేంద్రం హామీ

**మొదటి పేజీ తరువాయి)**

చర్చకు సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ప్రకటించారు. దీంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్టంభనకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశానికీ ప్రభుత్వం సమాధానం ఇస్తుందని చెప్పారు. ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా సభలో ఈ అంశంపై స్పందిస్తారని స్పష్టం చేశారు. అయితే అమిత్ షా ప్రకటన సమయంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించకూడదని రిజిజు కోరారు. హోంమంత్రి సమాధానాన్ని పూర్తిగా వినాలని సూచించారు. చర్చ మొదలైన తర్వాత ప్రతి అంశంపైనా విస్తృతంగా మాట్లాడవచ్చని చెప్పారు. జూన్ 20న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసనపై పోలీసులు తీసుకున్న చర్యలను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. విద్యార్థులపై పోలీసులు అతిగా వ్యవహరించారని ఆరోపిస్తున్నాయి. పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన వార్తలపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ చర్యలు అమిత్ షా ఆదేశాలతో జరిగాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అమిత్ షా నుంచి సమాధానం కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభలో వరుసగా నిరసనలు చేపడుతున్నారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే నినాదాలతో కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ గేట్ల వద్ద కూడా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.

# తమిళనాడు రాష్ట్ర గీతంపై అసెంబ్లీ తీర్మానం.. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం విజయ్

**మొదటి పేజీ తరువాయి)**

కార్యక్రమాలను ఇకపై తప్పనిసరిగా రాష్ట్ర గీతమైన 'తమిళ తాయ్ వాళ్తు'తోనే ప్రారంభించాలని ఈ తీర్మానం స్పష్టం చేస్తోంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ సహా సభలోని అన్ని పక్షాలు దీనికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. అనంతరం మూజువాణి ఓటింగ్ ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ ప్రకటించారు. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి విజయ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది తమిళ అస్తిత్వానికి, భాషా గౌరవానికి దక్కిన చారిత్రక విజయమని ఆయన అభివర్ణించారు. "తమిళం కేవలం ఒక భాష కాదు, అది ఒక ఆలోచన, సంస్కృతి, నాగరికత, జీవన విధానం, చైతన్యం" అని ఆయన పేర్కొన్నారు. 1891లో మనోన్మణియం సుందరనార్ రచించిన 'మనోన్మణియం' నాటకం నుంచి ఈ గీతాన్ని స్వీకరించారు. 1970 నుంచే ప్రభుత్వ కార్యక్రమాల్లో దీనిని ఆలపిస్తున్నప్పటికీ, 2021లో అధికారికంగా రాష్ట్ర గీతంగా గుర్తించారు. ఈ తీర్మానం అమలుకు ఎలాంటి బాహ్య అనుమతులు అవసరం లేదని స్పీకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని మొదటగా ఆలపించాలని జూలై 9న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచనలు జారీ చేసిన నేపథ్యంలో ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో ఇతర గీతాల తర్వాత 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడటం రాష్ట్రంలో రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం భాషా, సాంస్కృతిక హక్కులను పునరుద్ఘాటిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

# నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతాం : కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి)**

వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారుఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు.

# వరుణదేవా.. కరుణించవా...

**మొదటి పేజీ తరువాయి)**

సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ వరుణ యాగం నిర్వహించామని ఆయన అన్నారు. వరుణ యాగం ముగించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా హైద్రాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ పవిత్ర వరుణయాగ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు, పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె. జానారెడ్డి తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మావోయిస్టు కంచుకోట కర్రిగుట్టలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

**మొదటి పేజీ తరువాయి)**

కర్రిగుట్టలో ఇప్పుడు శాంతి నెలకొనడంతో అభివృద్ధి, పర్యాటక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం కర్రిగుట్టను సందర్శించిన డీజీపీ సీవీ ఆనంద్.. మారుమూల అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, శాంతికి ప్రతీకగా తెల్ల పావురాలను ఎగురవేశారు. పోలీస్, సీఆర్పీఎఫ్, అటవీ, రెవెన్యూ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ.. తెలంగాణ పోలీస్, గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ బలగాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల వల్ల ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఆపరేషన్ కగార్ సమయంలో దాదాపు 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని, పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా.. మరికొందరు జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చారని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కొద్దిమంది కేంద్ర కమిటీ స్థాయి నేతలు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డీజీపీ వివరించారు. ఆర్థిక సహాయం, భూమి కేటాయింపు, జీవనోపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారు సమాజంలో తిరిగి స్థిరపడేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పర్యాటక కేంద్రంగా కర్రిగుట్టకు అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని సీవీ ఆనంద్ తెలిపారు. పర్యావరణ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. పామూరు నుంచి చలమాదవ వరకు తారు రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారి కనెక్టివిటీ మెరుగుపరచడంతో పాటు విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్, ఇతర మౌలిక వసతులను కల్పించి పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం సృష్టించనున్నట్లు చెప్పారు. పామూరు క్యాంపు సమీపంలో నివసిస్తున్న గుత్తి కోయ కుటుంబాలకు డీజీపీ నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, ప్రభుత్వం నుంచి నిరంతర సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సీఆర్పీఎఫ్ సేవలకు ప్రశంసలు మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో దశాబ్దాలుగా రాష్ట్ర పోలీసులతో కలిసి పనిచేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది సేవలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. కఠినమైన అటవీ ప్రాంతాల్లో 196వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది నెలల తరబడి కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి అంకితభావం, వృత్తి నైపుణ్యం ఈ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ సంజయ్ జైన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఎస్ఐబీ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, సీఆర్పీఎఫ్ అధికారులు, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా లాల్‌దర్వాజా మహంకాళి బోనాలు

**మొదటి పేజీ తరువాయి)**

పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో లాల్ దర్వాజా పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. జాతర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు, ప్రజాప్రతినిధులకు అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

**ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత : మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ బోనాల జాతరకు ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆలయానికి వచ్చిన వారందరికీ అమ్మవారి దర్శనం సులభంగా అయ్యేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో తెలంగాణ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన అధికారులకు, పోలీసులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అమ్మవారిని వేడుకున్నట్టు చెప్పారు

**భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు : మంత్రి కొండా సురేఖ**

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని దేవాలయాల్లో బోనాల జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

**బంగారు బోనం సమర్పించిన కలెక్టర్**

సింహవాహిని అమ్మవారికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు హైకోర్టు జస్టిస్ ఎస్. నంద అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకుని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే ఠాగూర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వివిధ కార్పొరేషన్ చైర్మెన్లు మెట్టు సాయి కుమార్, సరితా తిరుపతయ్య యాదవ్, భాస్కర్, అజయ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, నగర సీపీ సజ్జనార్, స్పెషల్ ఆఫీసర్ రవి, ఆర్డీవో రామకృష్ణ, సినీహీరోలు విజయ దేవరకొండ బ్రదర్స్, ప్రముఖ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహించారు.

# జార్ఖండ్‌లో ఉద్రిక్తత..విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్

**మొదటి పేజీ తరువాయి)**

అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వేలాది మంది యువత సోమవారం అసెంబ్లీకి ర్యాలీగా వెళ్లారు. విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే విద్యార్థులు బారికేడ్లను దాటుకుని అసెంబ్లీ వైపు దూసుకువెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు వాటర్ కెనాన్‌లు ప్రయోగించారు. పరీక్షల అక్రమాలకు నిరసనగా గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న 'జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారీ మోర్చా' నేత దేవేంద్ర నాథ్ మహతో కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నిరవధిక నిరాహార దీక్ష? కారణంగా ఆయన 10.5 కిలోల బరువు తగ్గారు. అయినప్పటికీ ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ చిత్రపటాన్ని పట్టుకుని కనిపించారు.చర్చలతోనే పరిష్కారం కనుగొంటామని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆదివారం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆరోసారి విద్యార్థుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. చర్చల అనంతరం 14వ జేపీఎస్సీ సంయుక్త సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షతో సహా మూడు పరీక్షలను రద్దు చేసేందుకు జార్ఖండ్ ప్రభుత్వం ఆదివారం అంగీకరించింది. అయినా విద్యార్దులు వెనక్కి తగ్గలేదు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ)కి చెందిన ముగ్గురు సభ్యులు కూడా ఆదివారం రాజీనామా చేశారు. ప్రభుత్వంతో చర్చల సందర్భంగా విద్యార్థులు చేసిన పలు ప్రతిపాదనలకు ప్రభుత్వం అంగీకరించామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే జెఎస్ఎస్‌సి-సిజిఎల్ పరీక్ష?లో జరిగిన అవతవకలపై సిబిఐ విచారణ చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. సిబిఐ విచారణకు ఆదేశించేంత వరకు ఈ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ మార్చ్‌కి పిలుపునిచ్చారు. దీంతో రాంచీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిజెపి విద్యార్థులను రెచ్చగొట్టేందుకు యత్నిస్తోందని జార్ఖండ్ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ విమర్శించారు.



# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి.

**ఏ.ఐ.కే.ఎం.ఎస్ - ఐ.ఎఫ్.టీ.యూ ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా జైల్ భరో నిరసన".**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. విజయ కెరటం.**

కేంద్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతు, కార్మిక, ప్రజలకు వ్యతిరేకంగా దేశంలో బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తున్న విధానాల మూలంగా పేదరికం, అసమానతలు పెరిగిపోతున్నాయని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జ్వాల వెంకటేశ్వర్లు, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంగరాల నరసింహ, బొమ్మిడి నగేష్ లు అన్నారు. అమెరికా, బ్రిటన్, లండన్ తదితర దేశాలతో బిజెపి కేంద్ర ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) ఇచ్చిన దేశవ్యాప్త జైల్ బరో కార్యక్రమం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐకేఎంఎస్, ఐఎఫ్ టీ యు సంఘాల ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహ వద్ద జైల్ బరో నిరసనను తెలిపి వాణిజ్య ఒప్పందాల ప్రజలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాలను ఉపసంహరించుకోవాలని, పాత గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్, యూరోపియన్ దేశాలతో భారత ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ ఒప్పందాలు చేసుకోవడం, భారత వ్యవసాయ రంగంలోకి 32 దేశాల నుండి దిగుమతులకు అవకాశం కల్పించడం రైతులను సంక్షేమలోకి నెట్టివేయడమేనని తెలిపారు. ఇతర దేశాలలో పండించిన పంటలను భారత్ కు దిగుమతి చేస్తే జీరో సుంకం విధించడం భారత్ పంటలను




ఎగుమతి చేస్తే 50% శుంకాలను విధించడం మోడీ ప్రభుత్వ అసమర్థ విధానాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. మరోవైపు దేశంలో రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్రమోడీ ప్రభుత్వ పాసిస్తూ విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులలో జైలు బరో కార్యక్రమాలు నిర్వహిస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామికమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్, ఐ ఎఫ్ టి యు, పి డి ఎస్ యు, పి వై ఎల్ నాయకులు బీవీ చారి, పోలే పవన్, రావుల వీరేష్, చింతల వెంకటరమణ,అక్కినపల్లి అంజి, బొల్లెపల్లి రామకృష్ణ, సాగర్, ఇందూరి లోకేష్, ప్రణబ్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి.






**స్వేచ్ఛ వాణిజ్య వ్యాపార ఒప్పందాన్ని రద్దు చేయాలి.**
**విబిగ్రాంజి పథకాన్ని రద్దు చేయాలి.**
**జైల్ బరో సందర్భంగా పట్టణంలో ర్యాలీ అరెస్ట్**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. విజయ కెరటం.**

కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతులు కార్మికులు వ్యవసాయ కార్మికులు మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి రావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం డి సలీం వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ లు పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైల్ భరో సందర్భంగా సుభాష్ విగ్రహం నుండి పెద్ద గడియారం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తుండగా కలెక్టర్ బంగ్లా దగ్గరకు రాగానే పోలీసులు అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను ముందుకు తీసుకెళ్తూ కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్నదన్నారు. లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరవణ బిల్లు–2025ను ప్రవేశపెట్టడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. సులభతర వ్యాపారం పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 300 మందికి పైగా పనిచేసే కంపెనీల్లో కార్మికులను ఎలాంటి నోటీసు లేకుండా తొలగించే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. "హైర్ అండ్ ఫైర్" విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికుల రక్షణకు, వారి హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకునేంత వరకు ప్రజా ఉద్యమాలు, జైల్ భరో వంటి కార్యక్రమాలను మరింత ఉదృతం చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పంటలకు సమగ్ర మద్దతు, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను ఉపసంహరించుకోవాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఉపాధి హామీ పనులను విస్తరించి, పనిదినాలు పెంచడంతో పాటు కూలీలకు గిట్టుబాటు కూలి అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి, కనీస వేతనం, సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, రైతు సంఘం జిల్లా నాయకులు నలపరాజు సైదులు పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండా అనురాధ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొండ వెంకన్న సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ గంజి రాజేష్ కత్తుల యాదయ్య, సుంకర బోయిన వెంకన్న సాగర్ల మల్లయ్య పేర్ల సంజీవ గౌరీదేవి మధుసూదన్ కట్ట అంజయ్య కండే యాదగిరి బొల్లు రవీందర్ ఉప్పల గోపాల్ ఔరేసు మారయ్య చల్ల యాదయ్య పజ్జురు యాదగిరి, సరిత తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**నిందితులను కఠినంగా శిక్షించి ఉరితీయాలి మంత్రివర్యులు**
**ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరిశిక్ష వేయాలి గద్వాల ఎమ్మెల్యే**

ఈ రోజు ఐజ మండల కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్ర లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని గారు , ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి అశ్రునయనాల మధ్య నివాళు లర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించి ఉరితీయాలి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జరిగిన ఈ సంఘటన అత్యంత దుర్మార్గమైనది, మానవత్వానికే మచ్చ తెచ్చేలా ఉంది.?ఇది ఎంతమాత్రం ప్రమాదం (యాక్సిడెంట్) కాదు, 100% ప్రణాళికాబద్ధంగా చేసిన హత్యే అని,?ఈ ఘటనకు కారణమైన నిందితులకు చట్టప్రకారం కఠినమైన ఉరిశిక్ష పడేలా చూస్తామని, ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో కూడా మాట్లాడతానని తెలిపారు.?ఘటన గురించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.?అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత మళ్లీ వచ్చి కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరఫున పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ?భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠినమైన నూతన చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరిశిక్ష వేయాలి: ఐజ మండలానికి చెందిన డాక్టర్ ప్రియాంకను హత్య చేసిన నిందితులను వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, 2–3 నెలల వ్యవధిలోనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. కేసు విచారణను నెలల తరబడి సాగదీయకుండా త్వరితగతిన న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందించాలని కోరారు. మహిళల భద్రతకు భరోసానిచ్చేలా చట్టాల్లో మార్పులు తెచ్చి, కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. డాక్టర్ ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి గడ్డం కృష్ణారెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, రమేష్ నాయడు, విక్రమ్ సింహారెడ్డి, ,రాజు చైర్మెన్ తిమ్మారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ జెడ్పీటిసి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్స్ గోవిందు రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్స్ తుమ్మల నరసింహులు యాదవ్, నాగిరెడ్డి,నరహరి శ్రీనివాసులు, ఇసాక్, నాయకులు గోవిందు, వంట భాస్కర్, సుదర్శన్, రిజ్వాన్, మోసిన్, మైలగడ్డ చంద్రశేఖర్ ,డి. వై రామన్న, నాగేంద్ర యాదవ్, ధర్మనాయుడు, ప్రవీణ్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటన్న, చిరు, కిట్టు, నాగార్జున, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తొలగించిన శిలాఫలకం పునరుద్ధరణ...

**నల్లగొండ జిల్లా ప్రతినిధి. విజయ కెరటం**




గత వారం.. రింగ్ రోడ్డు కోసమని మర్రిగూడ బైపాస్ రోడ్ లో.. బుద్ధవనాన్ని తొలగించే ప్రయత్నం చేయగా స్థానిక బిఆర్ఎస్ దళిత నాయకులు.. ప్రజా సంఘాలు వారు అడ్డుకున్న సంగతి తెలిసిందే.. వారి ఆందోళన ఫలితంగా తొలగించిన బేస్మెంట్ ను యధావిధిగా కాంక్రీట్ తో నిర్మాణం చేశారు కానీ... నాటి మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ప్రారంభించిన,బుద్ధవనం ప్రారంభ శిలాఫలకాన్ని తొలగించారు.. అప్పుడే శిలాఫలకాన్ని కూడా యధావిధిగా పునరుద్ధరిస్తామని చెప్పినప్పటికీ... అలానే వదిలేశారు. తిరిగి సోమవారం వారు అధికారులను... ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే శిరాఫలకాన్ని పునరుద్ధరించాలని లేకుంటే తిరిగి ఆందోళన చేపడతామని తెలియజేయడంతో అధికారులు దిగివచ్చి వెంటనే శిలాఫలకాన్ని యధావిధిగా ఏర్పాటు చేశారు. దీనితో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో పెరిక కరణ్ జయరాజ్, జమాల్ ఖాద్రి కందుల లక్ష్మయ్య, కొండేటి మహేష్, కొప్పోలు అశోక్ తదితరులు వెంటఉన్నారు

## తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ కట్టంగూరు మండల శాఖ నూతన ప్రధాన కార్యదర్శిగా శ్రీ పెండెం శ్రీనివాసులు ఏకగ్రీవ ఎన్నిక.




**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . విజయ కెరటం .**

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి ఆర్ టి ఎఫ్) కట్టంగూరు మండల నూతన ప్రధాన కార్యదర్శిగా పెండెం శ్రీనివాసులు, స్కూల్ అసిస్టెంట్ (హిందీ), జడ్పీహెచ్ఎస్ పరడ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనది. సోమవారం జరిగిన మండల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కట్టంగూరు మండలంలో టి ఆర్ టి ఎఫ్ సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ప్రధాన కార్యదర్శి పెండెం శ్రీనివాసులు అన్నారు.కట్టంగూరు మండల శాఖ అధ్యక్షులు చిట్టబోయిన లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తరాల పరమేశ్ యాదవ్, రాష్ట్ర గౌరవ సలహాదారులు ముప్పిడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ విజయ విహార్‌లో కృష్ణానది ఒడ్డున వరుణ యాగం ప్రారంభం .

- **రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రశ్యామలంగా ఉండాలి.**
- **రాష్ట్ర నీటిపారుదల, పౌరసరపాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి దంపతులు.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . విజయ కెరటం .**



రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న వరుణ యాగాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, యాదగిరిగుట్ట ఈఓ భవాని శంకర్, డిప్యూటీ ఈఓతో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. యాగ ప్రారంభంలో ఋత్వికులు గోపూజ, విశ్వక్సేన పూజ నిర్వహించి, యాగశాల ప్రవేశ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలి.

- **రైతన్న లు,వ్యవసాయ ఆధారిత రంగాలు అన్ని వృద్ధిని సాధించాలి.**
- **తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.**



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. విజయ కెరటం .**



వర్షాలు సంవృద్ధిగా కురిసి ,, పంటలు బాగా పండాలి అనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాగార్జున సాగర్ లోని విజయ్ విహార్ లో మహా వరుణ యాగం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో సోమవారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎల్ నినో ప్రభావం తగ్గుముఖం పట్టి వాతావరణ పరిస్థితులు మెరుగవాలని , వర్షాలు సంవృద్ధిగా కురవాలని , రైతన్నలు ఆలాగే వ్యవసాయ ఆధారిత రంగాలు అన్ని వృద్ధిని సాధించాలని ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి కోరుకున్నారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

## ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం.. 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!



స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే – డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది.గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రొళ్ల నిర్మిస్తున్నారు.ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## కొడుక్కి రామ్ చరణ్ పేరు.. అభిమాని ప్రేమకు ఫిదా.. ఇంటికి పిలిచిన చిరంజీవి!

**'మెగా 158' సెట్స్‌లో టెక్నీషియన్‌ను పలకరించిన చిరంజీవి**
**రామ్ చరణ్ వీరాభిమానినని, కొడుక్కి ఆయన పేరే పెట్టానని వెల్లడి**
**భావోద్వేగానికి గురై టెక్నీషియన్ కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించిన మెగాస్టార్**
**అభిమాని ఫ్యామిలీతో సమయం గడిపిన చిరంజీవి, రామ్ చరణ్**

మెగాస్టార్ చిరంజీవి తన అభిమానులను సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తారనడానికి మరో సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఓ సాధారణ టెక్నీషియన్ చూపిన అభిమానానికి ముగ్ధుడై, అతడి కుటుంబాన్ని ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు. ఈ ఆత్మీయ భేటీలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పాల్గొనడం విశేషం. ఈ హృద్యమైన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం చిరంజీవి 'మెగా 158' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్‌ను చిరంజీవి పలకరించారు. మాటల సందర్భంలో నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని, ఆ అభిమానంతోనే తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అని పేరు పెట్టుకున్నానని చిరంజీవితో చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించి, భావోద్వేగానికి గురయ్యారు.వెంటనే నివాస్‌ను తన కుటుంబంతో సహా ఇంటికి రావాలని ప్రేమగా ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపుతో ఆనందంలో మునిగిపోయిన నివాస్, తన కుటుంబంతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా వారిని ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ముఖ్యంగా చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ కాసేపు సరదాగా గడిపారు. అనంతరం నివాస్ కుటుంబంతో కలిసి చిరు, చరణ్ ఫొటోలు దిగారు.ఈ అరుదైన క్షణాలకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ హీరోల గొప్ప మనసును ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఓ సాధారణ అభిమానికి మెగా ఫ్యామిలీ ఇచ్చిన గౌరవం, వారి మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని అంటున్నారు.



## వాణిజ్య ఒప్పందం నుండి భారత్ వైదొలగాలి: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు






**వరంగల్ ప్రతినిధి,విజయ కెరటం, ఆగష్టు 10 :**

భారత వ్యవసాయ రంగాన్ని నష్టం కలిగించే అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం నుండి భారత్ వైదొలగాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.సోమవారం వరంగల్ నగరంలోని అబ్బనికుంటలో గల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి అక్కడినుండి రైతు సంఘ కార్మిక నాయకులతో కలిసి ఒక మెమొరండం తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం నుండి భారత్ వైదొలగాలని డిమాండ్ తో సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం, కార్మిక సంఘాలు సంయుక్తంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఇచ్చిన జైల్ బరో కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రైతు సంఘం యుఎస్ఎఫ్ఐ సంయుక్తంగా తెలంగాణ రైతు భవనం అబ్బనికుంట నుండి వెంకట్రామ థియేటర్ వరకు ర్యాలీ ప్రదర్శన నిర్వహించి జంక్షన్ లో ఆందోళన రాస్తారోకో చేశారు.అనంతరం మోర్తాల చందర్ రావు మాట్లాడుతూ అమెరికా భారత్ కుదుర్చుకోనున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం వలనవిదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి ల పై పన్నులు ఉపసంహరించుకోవడం వలన మన దేశంలోకి కారు చవకగా దిగుమతి అయ్యే ఆహార ఉత్పత్తులతో దేశీయ ఉత్పత్తుల ధరలు ఘననీయంగా పడిపోయి మన రైతులకు కనీసం పంటలపై పెట్టుబడులు కూడా చేతికి రాక రైతులు పూర్తిగా దివాలా తీసి వ్యవసాయాన్ని వదిలేసే ప్రమాదం ఉందని అందుకే తక్షణమే భారత్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం నుండి వైదొలగాలని చందర్ రావు డిమాండ్ చేశారు.ఈ రాస్తారోకో వల్ల ట్రాఫిక్ భారీగా నిలిచిపోయి రవాణాకు అంతరాయం ఏర్పడింది పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్ ను నియంత్రించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాషిపాక రమేష్,కోశాధికారి సంపత్ కుమార్, నాయకులు నర్సయ్య శంకర్ రావు,ఆనందరావు, పెండ్లి కొమురెల్లి వీరమల్లు, శ్రీనివాస్,యు ఎస్ ఎఫ్ ఐ నాయకులు ఆకుల మనోజ్,రాజేష్ నాయక్,జయకృష్ణ,సూరజ్, శివ,మహేష్,సాయి తదితరులు పాల్గొన్నారు




## రవితేజ 'ఇరుముడి' ట్రైలర్ రిలీజ్ పై స్పెషల్ పోస్టర్

మాస్ మహారాజా రవితేజ, విజయవంతమైన దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, ఈ చిత్రబృందం ప్రమోషన్ల స్పీడు పెంచింది.ఈ క్రమంలో, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్ ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీ స్థాయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది."తన కుటుంబాన్ని కాపాడేందుకు ఓ వ్యక్తి విశ్వాసాన్నే తన అతిపెద్ద ఆయుధంగా మార్చుకుని చేసే ప్రయాణమే ఈ సినిమా" అంటూ విడుదల చేసిన ట్యాగ్‌లైన్, 'ఇరుముడి' అనే టైటిల్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, టీ–సిరీస్‌తో కలిసి నిర్మిస్తోంది. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528